క్లుప్తంగా

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు అడ్డగింత



షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట):గ్రామంలోని ఓ దుకాణం వద్ద విద్యుత్ స్మార్ట్ మీటరు అమర్చడాన్ని సీపీఎం నాయకులు బుధవారం అడ్డుకున్నారు. గ్రామానికి చెందిన పోలిరెడ్డి తిరుపతిరెడ్డి కిరాణా దుకాణానికి విద్యుత్‌శాఖ సిబ్బంది స్మార్ట్ మీటరు బిగిస్తుండగా విషయం తెలుసుకున్న సీపీఎం నాయకులు మీటరు బిగించవద్దని అడ్డుకున్నారు. విద్యుత్ శాఖాధికారులు సర్ది చెప్పేందుకు యత్నించినా సీపీఎం నాయకులు ససేమిరా అన్నారు. పార్టీ కార్యదర్శి నాగమణి మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచమని హామీ ఇచ్చిందన్నారు. కానీ సీఎం చంద్రబాబు చార్జీలు పెంచడంతోపాటు స్మార్ట్ మీటర్లు పెట్టి సామాన్యులపై భారం మోపుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు కోట కృష్ణ, గౌస్‌మియా పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం



జగ్గయ్యపేటఅర్బన్: భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంను ప్రతివిద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) సూచించారు. స్థానిక బలుసుపాడు రోడ్డులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో చిల్లకల్లు కాంప్లెక్స్ సెక్రటరీ జిల్లేపల్లి సుధానంద్ ఆధ్వర్యంలో బుధవారం వివధ రాష్ట్రస్థాయి సైన్స్ కార్యక్రమాల్లో ప్రతిభచూపిన ఉపాధ్యాయులకు అభినందనసభ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తాతయ్య పాల్గొని ఉపాధ్యాయులు జి.చంద్రోశేఖర్(జీవీజె జెడ్పీ బాలుర హైస్కూల్, జగ్గయ్యపేట), కె.శ్రీదేవి(అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, జగ్గయ్యపేట), వెంకటరమణమ్మ(జెడ్పీ బాలికల హైస్కూల్, జగ్గయ్యపేట), నగీన(గురుకుల పాఠశాల, వత్సవాయి)ను ఘనంగా సత్కరించారు. ఇంటర్మీడియట్ పరీక్షల్లో ప్రతిభ కనపరచిన అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులను అభినందించారు. అభినందించారు. కార్యక్రమంలో గురుకుల ప్రిన్సిపాల్ కె.లక్ష్మీసుజాత, వైస్ ప్రిన్సిపాల్ శౌరీలమ్మ, ఉపాధ్యాయులు జిల్లేపల్లి సుధానంద్, ఆర్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ పునర్వికాస సభను విజయవంతం చేయాలి



విజయవాడ కల్చరల్: జాతి ఉన్నతిని, ఔన్నత్యాన్ని చాటే గ్రంథాలయాలకు పూర్వవైభవం తీసుకురావాలని.. ఈ ఉద్యమంలో కవులు, రచయితలు, పబ్లిషర్స్ భాగస్వాములు కావాలని గ్రంథాలయ పునర్వికాస వేదిక కన్వీనర్ వల్లూరి శివప్రసాద్ పిలుపు నిచ్చారు. వేదిక ఆధ్వర్యంలో బుధవారం విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. శివప్రసాద్ మాట్లాడుతూ.. స్థానిక గ్రంథాలయ వ్యవస్థ నిర్వీర్యమైపోయిందన్నారు. వ్యవస్థకు పూర్వ వైభవం తీసుకురావడానికి రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో చైతన్యం తీసుకురావడానికి వేదిక ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని తెలిపారు. ఈ నెల 27వ తేదీ ఆదివారం బందరు రోడ్డులోని మాకినేని బసవపున్నయ్యా విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర స్థాయి సదస్సును నిర్వహిస్తునట్లు తెలిపారు. ఈ సదస్సులో విద్యాసంస్థలు, గ్రంథాలయాలు, సాంకేతిక రంగంలో పుస్తక పఠనం, పౌరగ్రంథాలయాలు, సమస్యల పరిష్కార మార్గాలు అంశంగా పలువురు తమ అభిప్రాయాలను తెలియజేస్తారని వివరించారు. వేదిక కీలక బాధ్యుడు బెల్లపు బాబ్జి మాట్లాడుతూ ఈ సమావేశంలో రాష్ట్రంలో వివిధ ప్రాంతాల కవులు, రచయితలు, పుస్తక విక్రేయతలు, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీతలు పాల్గొంటారని తెలిపారు. మనోహర నాయుడు, లక్ష్మయ్య, లక్ష్మి, వెంకటనారాయణ, చలపాక ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. ఉద్యమ పోస్టర్‌ను అతిథులు ఆవిష్కరించారు.

కమర్షియల్ ట్యాక్స్ క్రికెట్ టోర్నీలో రాణింపు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కమర్షియల్ ట్యాక్స్ వెంకటగిరి సర్కిల్ ఆధ్వర్యంలో ఆ శాఖ ఉద్యోగులకు జరిగిన రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో విజయవాడ డివిజన్‌కు చెందిన ఉద్యోగుల టీమ్ రన్నర్స్‌గా నిలిచి కప్‌ను గెలుచుకున్నారు. కమర్షియల్ ట్యాక్స్ చిత్తూరు డివిజన్ సౌజన్యంతో వెంకటగిరిలో ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు టోర్నమెంట్‌ను నిర్వహించారు. అందులో భాగంగా విజయవాడ డివిజన్‌కు చెందిన టీమ్ జి.కిరణ్‌కుమార్ కెప్టెన్‌గా ద్వితీయ స్థానంలో నిలిచి రన్నర్ కప్‌ను గెలుచుకున్నారు. ఈ సందర్భంగా విజయవాడ డివిజన్ 1, 2 జాయింట్ కమిషనర్ ఎస్.ప్రశాంత్‌కుమార్‌ను విజయం సాధించిన ఉద్యోగుల బృందం కలిసి కప్‌ను అందించగా ఆయన వారిని అభినందించారు.

ఎమ్మెల్యేలకు సమస్యల ఏకరువు

- ప్రజాదర్బార్‌కు భారీగా అర్జీలు
- సమస్యలు పరిష్కరించాలంటూ ఎమ్మెల్యేలకు జనం మొర



కంచికచర్ల: తమ భూములను కాపాడాలంటూ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యకు అర్జీలు అందజేస్తున్న పరిటాల రైతులు



పెనుగంచిప్రోలు: తమ సమస్యలను పరిష్కరించాలంటూ జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య)కు అర్జీలు ఇస్తున్న ప్రజలు

కంచికచర్ల: ప్రజాసమస్యలపై అర్జీలు స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య బుధవారం కంచికచర్లలోని గ్రామసచివాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌కు ప్రజలు క్యూ కట్టారు. ఆయా సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు నేరుగా ఎమ్మెల్యేకు అర్జీలు అందజేశారు. పదినెలలుగా తమ సమస్యలు పరిష్కారానికి నోచుకోకుండా ఉన్నాయంటూ ఎమ్మెల్యే ఎదుట తమ సమస్యలను ఏకరువు పెట్టారు. ఆయా సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే సౌమ్య హామీ ఇచ్చారు. సమస్యలను పరిష్కరించాలంటూ 95మంది అర్జీలు అందజేసినట్లు ఎంపీడీఓ బి.ఎం.విజయలక్ష్మి తెలిపారు. పరిటాల శివారులోని రాతి క్వారీల బూడిద కారణంగా తమ పంటలన్నీ నాశనమవుతున్నాయంటూ రైతులు ఆవేదన వ్యక్తంచేస్తూ ఎమ్మెల్యేకు అర్జీ ఇవ్వగా, కూటమి నాయకులు బోగస్ ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేసి మున్నేరులో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారంటూ వేములపల్లి వాసులు సమస్యను ఎమ్మెల్యేకు వివరించారు. ఆయా సమస్యలు నెలల తరబడి పరిష్కారానికి నోచుకోక అవస్థలు పడుతున్నామని ప్రజలు వాపోతయారు. అర్జీదారుల అభిప్రాయాలు వారి మాటల్లోనే ...

పెనుగంచిప్రోలులో 112 అర్జీలు అందజేత

పెనుగంచిప్రోలు: స్థానిక కోదండ రామాలయం ఫంక్షన్‌హాల్‌లో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) నిర్వహించిన ప్రజాదర్బార్‌కు ప్రజలు హాజరై ఆయా సమస్యల పరిష్కారం కోరుతూ 12 అర్జీలు అందజేశారు. రెవెన్యూ సమస్యలపై 33 అర్జీలు, పింఛన్ల మంజూరు కోరుతూ 24, ఇంటి స్థలాల కోసం 26, రేషన్‌కార్డుల కోసం 8, ఇతర సమస్యల పరిష్కారం కోరుతూ 21 అర్జీలు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ మాట్లాడుతూ ఆయా అర్జీల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. గ్రామంలోని పోలీస్‌స్టేషన్ వద్ద టాయిలెట్లు నిర్మాణం, డొంక రోడ్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీ, శ్మశాన వాటికలు, కరెంట్ సమస్యలు, యువతకు అవసరమైన ప్లేగ్రౌండ్ సమస్యలను సత్వరమే పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎ.శాంతిలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి కె.శ్యామ్, మండల టీడీపీ అధ్యక్షుడు చింతల సీతారామయ్య, గ్రామ పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి సతీష్, మండల సమాఖ్య అధ్యక్షురాలు కర్ల కోటేశ్వరి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు కాకాని శ్రీనివాసరావు, గజ్జి కృష్ణమూర్తి, ఆలయ మాజీ చైర్మన్లు వాసిరెడ్డి బెనర్జీ, కర్ల వెంకటనారాయణ, మాజీ ఎంపీపీ వేగినేటి గోపాలకృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ జిల్లేపల్లి సుధీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బీడు భూములుగా మారాయి...



పరిటాల శివారు దొనబండ రాతి క్వారీల పక్కన వ్యవసాయ భూమిలో కంకర బూడిద పేరుకుపోతుంది. దీంతో భూసారం పూర్తిగా దెబ్బతిని పంటలు పండటం లేదు. ఆ భూమిని విక్రయిద్దామంటే క్వారీ యజమానులు బెదిరిస్తున్నారు. ఏం చేయాలో తోచడం లేదు. ఎమ్మెల్యే స్పందించి ఆదుకోవాలి .

– ఉప్పులూరి నాగేశ్వరరావు, రైతు, పరిటాల

ఇసుక మాఫియాపై చర్యలు తీసుకోవాలి...



వేములపల్లి గ్రామంలోని మున్నేరులో రీచ్‌ల పేరుతో అక్రమార్కులు ఇసుకను లోతుగా తవ్వి భారీ లారీలకు లోడ్ చేసి తరలిస్తున్నారు. దీంతో మున్నేరు సమీపంలో ఉన్న ఇళ్ల నిర్వాసితులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వరదల సమయంలో ఆ ఇళ్లన్నీ నీట మునుగుతున్నాయి. ఇసుక మాఫియాను కట్టడి చేయాలి.

– సీహెచ్ కృష్ణ వేములపల్లి

చోరీ సొమ్ము రికవరీ చేయలేదు..



గతేడాది తన బంగారు దుకాణంలో దొంగలు పడి రూ.17.50 లక్షల విలువగల బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఏడాదిగా సొమ్ము రికవరీ కాలేదు. సొమ్ము రికవరీ చేయించి ఆదుకోవాలి.

– జూలూరి సురేష్‌కుమార్, కంచికచర్ల

ఆలయ ముఖద్వారం ప్రారంభం



వీరులపాడు: ఆలయాలు అభివృద్ధి చెందితే గ్రామాలు సుఖశాంతులతో వర్ధిల్లుతాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. వీరులపాడు మండలంజుజ్జూరు గ్రామంలోని పార్వతీ సమేత సోమేశ్వరస్వామి వారి ఆలయంలో నూతనంగా నిర్మించిన భవనాలు, యాగశాల, ముఖద్వారాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రాచీన ఆలయాలకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. నూతన భవనాలు నిర్మించిన కమిటీ సభ్యులను అభినందించారు. నాయకులు శ్రీనివాస్‌కుమార్, రాంబాబు, సుందరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇసుక లారీ స్వాధీనం



చిల్లకల్లు(జగ్గయ్యపేట):తెలంగాణాకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తోట సూర్యశ్రీనివాస్ బుధవారం తెలిపారు. ముక్త్యాల చెక్‌పోస్టు వద్ద మంగళవారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో వాహనాల తనిఖీ చేస్తుండగా విజయవాడ నుంచి ఓ లారీ ఇసుకతో వస్తుండగా తనిఖీ చేశామన్నారు. తెలంగాణకు ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎండిన చెరుకు తోటలు

- విద్యుత్ సరఫరా లేక పనిచేయని బోర్లు
- పంటకు అందని సాగునీరు
- ఎండిన చేలను దున్నుతున్న రైతులు
- ఎకరాకు రూ.60వేలకుపైగా నష్టం
- ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్



గొట్టుముక్కల గ్రామపరిధిలో సాగునీరు అందక ఎండుబారు పట్టిన చెరుకు పంట



ఎండిన చెరుకు తోటను దున్నేసిన దృశ్యం

కంచికచర్ల: కూటమి పాలకుల మాటలు నమ్మి చెరుకు సాగురైతులు తీవ్రంగా నష్టపోయారు. వ్యవసాయానికి తొమ్మిది గంటలపాటు నిరంతరాయంగా విద్యుత్‌ను సరఫరా చేస్తామంటూ ఎన్నికల సమయంలో హామీలు గుప్పించిన కూటమి నేతలు, తీరా అధికారంలోకి వచ్చాక ఆ హామీని అమలుచేయడంలో పూర్తిగా విఫలమయ్యారు. దీంతో బోర్ల కింద సాగు చేసిన ఆయా పంటలకు సజావుగా నీరు అందక పంటలు ఎండిపోతూ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కంచికచర్ల మండలం గొట్టుముక్కల గ్రామపరిధిలో సాగవుతున్న చెరుకు తోటలు ఎండిపోయిన వైనమే ఇందుకు నిదర్శనం. విద్యుత్ సరఫరా లేని కారణంగా వ్యవసాయబోర్లు పనిచేయక ఈ గ్రామంలోని పదిమంది రైతులు సాగుచేసిన 50ఎకరాల్లోని చెరుకు పంట పూర్తిగా ఎండిపోయింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

ఎకరాకి రూ.60వేలు నష్టం..

కంచికచర్ల మండలం గొట్టుముక్కలలో రైతులు సాగుచేసిన చెరుకు పంటకు సకాలంలో సాగునీరు అందకపోవడంతో పంట ఎండిపోయింది. దీంతో నాలుగు రోజుల నుంచి రైతులు ట్రాక్టర్ల ద్వారా చెరుకు పంటను తొలగిస్తున్నారు. ఎకరా సాగుకు రూ.60వేల వరకు ఖర్చు చేశామని, తీరా విద్యుత్ సరఫరా లేని కారణంగా బోర్లు పనిచేయక పంటకు నీరుపెట్టలేని పరిస్థితి ఏర్పడటంతో పంటంతా ఎండిపోయిందంటూ రైతులు లబోదిబోమంటున్నారు. బోర్లలో సమృద్ధిగా నీరు ఉన్నప్పటికీ విద్యుత్ లేని కారణంగా పంటలను కాపాడుకోలేకపోయామని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

ప్రకటనలకే పరిమితమైన హామీలు..

సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రైతులకు ఉదయం ఏడుగంటల నుంచి నిరంతరాయంగా తొమ్మిది గంటలపాటు విద్యుత్‌ను సరఫరా చేస్తామంటూ ఇచ్చిన హామీ ఇచ్చినప్పటికీ ఆచరణలో ఆ హామీని అమలుచేయడం లేదు. దీంతో బోర్ల కింద సాగుచేసిన పంటలకు సాగునీరందక ఎండిపోతున్నాయి. గొట్టుముక్కల గ్రామనాయకులు చెరకు పంట ఎండిపోతున్న వైనాన్ని విద్యుత్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. వారంరోజులుగా వ్యవసాయ బోర్లకు సజావుగా విద్యుత్ సరఫరా కాకపోవడంతో చెరుకు పంట పూర్తిగా ఎండిపోయింది. దీంతో చేసేదేమిలేక రైతులు చెరుకు పంటను ట్రాక్టర్ల ద్వారా దున్నేస్తున్నారు.

పరిహారం ఇచ్చి ఆదుకోవాలి..

విద్యుత్ సరఫరా లేనికారణంగా పంటలు ఎండిపోయాయని, దీంతో తీవ్రనష్టం వాటిల్లిందని బాధిత రైతుల వాపోతున్నారు. ఇకనైనా రాష్ట్రప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతం

పెనుగంచిప్రోలు: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారానే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పాడుతుందని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ పేర్కొన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాల సందర్భంగా బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గర్భిణులకు సామూహిక సీమంతం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పోషక విలువలుగల ఆహారాన్ని క్రమంతప్పకుండా తీసుకోవాలని సూచించారు. గర్భిణులు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకుంటేనే పుట్టే బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. ఐసీడీఎస్ సీడీపీఓ పి.లక్ష్మీభార్గవి మాట్లాడుతూ పుట్టిన బిడ్డలకు ముర్రుపాలు తాగించటంతోపాటు 6 నెలల వరకు తప్పనిసరిగా తల్లిపాలు మాత్రమే పట్టించాలని బాలింతలకు సూచించారు. తహసీల్దార్ ఎ.శాంతిలక్ష్మి, ఎంపీడీఓ జి.శ్రీను, వైద్యాధికారి పి.ఇందిర, కేవీకే శాస్త్రవేత్త ప్రభావతి, వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, ఏసీడీపీఓ నాగమణి, అంగన్‌వాడీ కార్యకర్తలు సువర్చల, జయలక్ష్మి, నాగమణి, రాజ్యలక్ష్మి, ధనలక్ష్మి, కల్పన, విమల, మంజుల, భవాని, ఆయాలు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాల నివారణ



ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు

కంచికచర్ల : అగ్ని ప్రమాదాలు చోటుచేసుకోకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఫైర్ అధికారి టీ శ్రీనివాసరావు సూచించారు. కంచికచర్ల గొట్టుముక్కల రోడ్డులోని ద్వారకామయి అపార్ట్‌మెంట్‌వాసులకు అగ్ని ప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం అవగాహన కల్పించారు. ఫైర్ సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈసందర్భంగా ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ వేసవికాలంలో ఎక్కువగా అగ్ని ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉంటుందన్నారు. గ్యాస్ సిలిండర్ వెలిగించే సమయంలో తడిలేకుండా చూసుకోవాలన్నానరు. వంట గదిలో గ్యాస్ లీకవుతున్నట్లు గమనిస్తే వెంటనే కిటికీలు తెరిచి ఉంచాలన్నారు. వేసవికాలంలో వరిగడ్డికి ఆకతాయిలు నిప్పంటించే ప్రమాదం ఉన్నందున పశుపోషకులు పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బయట వ్యక్తులు ఆ ప్రాంతంలో సంచరిస్తే పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. బస్సు ప్రయాణించే సమయంలో టైర్ల రాపిడి కారణంగా కూడా మంటలు వస్తుంటాయని, అటువంటి సమయాల్లో బస్సు కిటికీల ద్వారా ప్రయాణికులు బయటకు రావాలని సూచించారు. కార్యక్రమంలో కె.ప్రవీణ్‌కుమార్, కె.జయరాం, షేక్ సుభాని, ఎం.శ్రీనివాసరావు, షేక్ తాజుద్దీన్, జీ రాజశేఖర్, జీవీ నర్సయ్య, సంజయ్‌వర్మ, జి.జీవన్, ఎస్.శ్రీనివాస్, అశోక్, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

హడలెత్తించిన అకాల వర్షం



షేర్‌మహ్మద్‌పేటలో తడిసిన మొక్కజొన్నలను ఆరబెడుతున్న రైతులు



పేటలోని కోదాడ రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

జగ్గయ్యపేట: జగ్గయ్యపేట మండలంలో మంగళవారం అర్ధరాత్రి ఈదురుగాలులతోపాటు మూడు గంటల పాటు వర్షం కురవడంతో రైతులు హడలెత్తారు. ఈ అకాల వర్షానికి కల్లాల్లోని ధాన్యం తడిసిపోయాయి. ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు నానా కష్టాలు పడ్డారు. పట్టణంలోని మార్కెట్ యార్డులోని ధాన్యం, ఆటోనగర్‌లోని కల్లాల్లోని మొక్కజొన్న, గౌరవరం, షేర్‌మహ్మద్‌పేట గ్రామాల్లోని కల్లాల్లోని ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. ధరలు లేక రైతులు నానా ఇబ్బందులు పడుతుంటే ఈఅకాల వర్షం మరింత చేటు తెచ్చిందని రైతులు కన్నీటిపర్యంతమయ్యారు. పలుచోట్ల కల్లాల్లో ధాన్యం తడిసి మొలకెత్తినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నందిగామ మండలంలో..

నందిగామటౌన్:నందిగామ పట్టణంతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం తెల్లవారుజామున ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన అకాల వర్షానికి రైతులు తీవ్రఇబ్బందులు పడ్డారు.కల్లాల్లో ఆరబెట్టిన వరిధాన్యం, మొక్కజొన్నలను కాపాడుకునేందుకు అవస్థలు పడ్డారు. ధాన్యంపై పట్టాలు కప్పినప్పటికీ ఈదురు గాలులు బలంగా వీయడంతో పట్టాలు లేచి ధాన్యం, మొక్కజొన్న తడిసిపోయాయి. అసలే ధరలు అంతంతమాత్రంగా ఉన్నాయని ఇప్పుడు తడిసిన ధాన్యాన్ని కొనేందుకు ఎవరు ముందుకు రారని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వమే స్పందించి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

ప్రతిభచూపిన 'మిక్' విద్యార్థి



కంచికచర్ల : స్థానిక మిక్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ ఐటీ విభాగం థర్డ్ ఇయర్ విద్యార్థి ఉయ్యూరు సృజిన్ రైజ్ ఇన్ క్యాంపస్ మావెన్ ఫెలోషిప్‌కు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.వంశీకిరణ్ బుధవారం తెలిపారు. విద్యార్థి సృజిన్‌ను ఆయన అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అంతర్జాతీయ ఎడ్యుకెట్ సంస్థ రైజ్ ఇన్ ఇంటర్యూలో పాల్గొన్న విద్యార్థుల్లో 41మంది ఎంపిక కాగా వారిలో తమ కళాశాలకు చెందిన విద్యార్థి ఉండటం గర్వకారణమన్నారు. ఎంపికైన విద్యార్థులు వాటిలో క్రియాశీలక పాత్ర పోషిస్తారని వివరించారు. విద్యార్థి సృజిన్‌ను కళాశాల సీఈఓ డి.పాండురంగారావు, మేనేజ్‌మెంట్ సభ్యులు డాక్టర్ ఎం సుహాన్, అధ్యాపకులు అభినందించారు.

పౌష్టికాహారంతో రక్తహీనతను అధిగమించవచ్చు



గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ శ్రీలత



పౌష్టికరమైన ఆహారం గురించి వివరిస్తున్న అంగన్‌వాడీలు

చందర్లపాడు(నందిగామ రూరల్):గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత సూచించారు. పౌష్టికాహార పక్షోత్సవాలలో భాగంగా చందర్లపాడు-7 అంగనవాడీ కేంద్రంలో పౌష్టికాహారం ప్రాధాన్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనత సమస్య తగ్గుతుందన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు పోషకాలతో కూడిన ఆహారం తయారు చేసుకునే విధానంపై అవగాహన కల్పించారు.

వత్సవాయి మండలంలో..

దబ్బాకుపల్లి(వత్సవాయి): తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బీబీజాన్ సూచించారు. మండలంలోని దబ్బాకుపల్లిలో బుధవారం పౌష్టికాహార పక్షోత్సవాలను నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలు తాగిస్తే ఆరోగ్యంగా ఉండటంతోపాటు వ్యాధినిరోధకశక్తి పెరుగుతుందన్నారు. గర్భిణులు, బాలింతలు ఐసీడీఎస్ ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని తప్పకుండా తీసుకోవాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు పాటించాల్సిన ఆరోగ్య జాగ్రత్తలపై వారికి అవగాహన కల్పించారు. బాలింతలు, గర్భవతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వారికి వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కూలీలకు వేతనాలు చెల్లించాలని డిమాండ్



ఏపీవోకు వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మికసంఘం నాయకులు

వీరులపాడు: ఉపాధి హామీ పథకం కింద పనిచేసే కూలీలకు ప్రభుత్వం వేతనాలు చెల్లించకపోవడంతో వారు అవస్థలు పడుతున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్ అన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కూలీలకు వేతనాలు చెల్లించాలని కోరుతూ బుధవారం ఆయన ఉపాధి హామీ పథకం ఏపీఓ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 12వేల మందికి పైగా జాబ్‌కార్డుదారులున్నారని వారిలో 10,600మందికి జనవరి నుంచి నేటివరకు కూలిడబ్బులు అందలేదన్నారు. వ్యవసాయ పనులు లేక ఉపాధి పనులకు వస్తున్న కూలీలకు వేతనాలు అందించకపోవడంతో ఇల్లు గడవక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూలీల వేతనాలను అందించడంలో ప్రభుత్వం తాత్సారం చేయడం తగదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వేతనాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు చాట్ల రవి, గద్దం ప్రభాకర్, అద్దంకి సాయి, చల్లా శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

రీ సర్వే డీటీగా రాజేంద్రప్రసాద్



కంచికచర్ల : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మండల రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా మాడుగుల రాజేంద్రప్రసాద్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. విజయవాడ నుంచి కంచికచర్ల ఉద్యోగోన్నతి బదిలీపై వచ్చారు. ఈసందర్భంగా మాడుగుల మాట్లాడుతూ రైతుల భూములను ఖచ్చితమైన కొలతలు, హద్దులతో రీ సర్వే చేస్తామని వివరించారు.